ప్రతిభ

మంచి మార్కులు సాధిస్తేనే భవిష్యత్తు బంగారం!

సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తిచేసిన వారిలో ఎక్కువ మంది ఇంజినీరింగ్ వైపు మొగ్గు చూపుతారు. ఇంటర్ తర్వాత కోర్సుల్లో ఇంజినీరింగ్‌ది ప్రత్యేక స్థానం. ఇంజినీరింగ్ తర్వాత బంగారు భవిష్యత్తు ఉంటుందని భావించడమే ఇందుకు కారణం. భారీ ప్రాజెక్టుల నిర్మాణంలో, బహుళ అంతస్థుల రూపకల్పనలో సాంకేతిక విజ్ఞానాన్ని ప్రయోగించడంలో ఇంజినీర్ల భాగస్వామ్యం అనివార్యం. అందుకే ఆ వృత్తిలో స్థిరపడాలనుకునే వారి కోసం దేశంలోని అనేక సంస్థలు పలు రకాలైన ఇంజినీరింగ్ కోర్సులను అందిస్తున్నాయి.

ఇంటర్ తర్వాత.. ఇంజినీరింగ్


డి.కృష్ణమూర్తి

ఇంజినీరింగ్‌ను కెరీర్‌గా ఎంచుకోవడానికి ముందు విద్యార్థులు ఇంజినీరింగ్‌లో లభిస్తున్న బ్రాంచీలు, కళాశాలలపై అవగాహన పెంపొందించుకోవాలి. నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సు ఇంటర్మీడియట్ చదివినంత సులభంగా ఉండదు. కష్టపడి చదవకపోతే ఇంజినీరింగ్ డిగ్రీ రాదు. కనీసం 70 శాతం మార్కులు సాధించిన వారికే భవిష్యత్తులో ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కనీసం 60 శాతం మార్కులైనా సాధించకుంటే ఇంజినీరింగ్ చేసి కూడా లాభం ఉండదు. మౌలిక వసతులులేని కాలేజీలను, డిమాండ్ బాగా ఉందనే కారణంతో ఆసక్తిలేని బ్రాంచ్‌లను ఎన్నుకుంటే మార్కులు పొందే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఇంజినీరింగ్ కోర్సును తేలిగ్గా తీసుకుని మొదటి సంవత్సరం సరిగ్గా చదవకపోయినా తక్కువ మార్కులు వచ్చే ప్రమాదముంది. మన రాష్ట్రంలోని విద్యార్థులు రెండేళ్లుగా పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకల్లోని కొన్ని డీమ్డ్ వర్సిటీలు, ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. దీనికి ఒక కారణం- మన రాష్ట్రంలో ఎంసెట్ నిర్వహణలో, తర్వాత వెబ్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేసి, తరగతులు ప్రారంభించడంలో తీవ్రమైన జాప్యం జరగడం. మరో కారణం- పొరుగు రాష్ట్రాల్లోని ఆయా కాలేజీలను 'జాతీయ స్థాయి కళాశాలలు (నేషనల్ లెవెల్ ఇన్‌స్టిట్యూట్స్)' గా భావించడం. నిజానికి ఆ కళాశాలల కంటే మన రాష్ట్రంలోని టాప్ టెన్ కాలేజీలే ప్రమాణాల పరంగా, క్రమశిక్షణ దృష్ట్యా ఎంతో బాగున్నాయి. కొన్ని డీమ్డ్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలు ఒక సంవత్సరంలో తీసుకునే ఫీజు మన రాష్ట్రంలోని కాలేజీల్లో నాలుగు సంవత్సరాల ఫీజు కంటే ఎక్కువే. కాబట్టి, ఇంజినీరింగ్ కాలేజీల ఎంపిక విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రకటనలు చూసి, కాలేజీ సీనియారిటీ చూసి, వారిచ్చే రాయితీలు చూసి నిర్ణయం తీసుకోకూడదు. కాలేజీని, అక్కడి మౌలిక వసతులనూ పరిశీలించాలి. వీలుంటే అక్కడి ఉపాధ్యాయులతో, విద్యార్థులతో చర్చించి కాలేజీని ఎంచుకోవడం మంచిది.

ప్రవేశ పరీక్షలు: దేశంలో, రాష్ట్రంలో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి రాత పరీక్షలు తప్పనిసరి. ప్రత్యేకించి జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక సంస్థలైన ఐఐటీల్లో చేరేందుకు జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇతర ప్రఖ్యాత సంస్థల్లో చేరడానికి ఏఐఈఈఈ (ఆల్ ఇండియా ఇంజినీరింగ్ / ఆర్కిటెక్చర్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్), ఐశాట్ మొదలైనవి ఉన్నాయి. రాష్ట్రాల విషయానికొస్తే మన రాష్ట్రంలో ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశ ద్వారం ఎంసెట్. వీటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

జాతీయస్థాయి పరీక్షలు

అత్యున్నత సాంకేతిక పరికరాలతో , ఉత్తమ నాణ్యతా ప్రమాణాలతో ఇంజినీరింగ్‌తో ఇతర డిగ్రీ, పీజీ కోర్సులను జాతీయ స్థాయిలో ఐ.ఐ.టి., ఎన్.ఐ.టి., ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్, బిట్స్ వంటి సంస్థలు అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి అఖిల భారత స్థాయిలో ప్రవేశ పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

- జాతీయ స్థాయి పరీక్షలకు సాధారణంగా డిసెంబరు-జనవరి మధ్య ప్రకటనలు వస్తాయి. పరీక్షలు ఏప్రిల్, మే, జూన్‌లలో జరుగుతాయి.
- రాష్ట్రస్థాయి పరీక్షలకు ప్రకటనలు జనవరి - ఫిబ్రవరి మధ్య వస్తాయి. పరీక్షలు మే, జూన్‌ల మధ్య జరుగుతాయి. ప్రవేశాలకు సంబంధించి కౌన్సెలింగ్ జూన్, జులైల్లో ఉంటుంది.

ఐఐటీ - జేఈఈ

దేశంలో పారిశ్రామిక పురోభివృద్ధికి సాంకేతిక నిపుణుల అవసరం చాలా ఉంది. పుష్కలంగా లభించే మౌలిక వనరులను, ముడిపదార్థాలను సకాలంలో సద్వినియోగపడేలా చూడటానికి, యంత్రపరికరాల సమర్థ నిర్వహణకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సంస్థ అభివృద్ధి పథంలో పయనించేలా చేయడానికి సాంకేతిక నిపుణులు కావాలి. దేశంలో మానవ వనరులకు కొరత లేదు. ఉన్న సమస్యల్లా వారికి సరైనశిక్షణ లేకపోవడమే. ఈ సమస్యను పరిష్కరించే ఉద్దేశంతో ప్రభుత్వం 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'లకు శ్రీకారం చుట్టింది. 1950లో దేశంలో తొలిసారిగా ఖరగ్‌పూర్‌లో మొట్టమొదటి ఐ.ఐ.టి.ని ఏర్పాటు చేశారు. కాలక్రమంలో ఐఐటీలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని అనేక ఐఐటీలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 16 ఐ.ఐ.టి.లు పనిచేస్తున్నాయి.

ఐఐటీల్లోని కోర్సులు: బి.ఇ., బి.టెక్., బి.ఆర్క్, బ్యాచ్‌లర్ ఆఫ్ డిజైన్.

సీట్లు : 5500 (ఐ.ఐ.టి.లకు చెందినవి 4000. మిగతావి అనుబంధ సంస్థలకు చెందినవి).

అర్హతలు: ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టులతో కనీసం 60 శాతం మార్కులుండాలి.

ప్రవేశ విధానం: ప్రతి సంవత్సరం అఖిల భారత స్థాయిలో జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జె.ఇ.ఇ.) నిర్వహించి విద్యార్థులను చేర్చుకుంటారు.

పరీక్ష విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. రెండు ప్రశ్నపత్రాలు ఇస్తారు. రెండు పేపర్లలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. కాలవ్యవధి 3 గంటలు. తప్పు సమాధానాలకు నెగిటివ్ మార్కులుంటాయి.

సిలబస్: 1) ఇంటర్మీడియట్ (రెండు సంవత్సరాలు కలిపి) సైన్స్ సబ్జెక్టుల్లోని అంశాలు.

2) సి.బి.ఎస్.ఇ. సిలబస్‌ను కూడా నిశితంగా పరిశీలించాల్సి ఉంటుంది.

2006 నుంచి ఐ.ఐ.టి.- జె.ఇ.ఇ.కి కేవలం రెండుసార్లు మాత్రమే హాజరు కావాలనే నిబంధన అమల్లోకి వచ్చింది.

ఏఐఈఈఈ

సాంకేతిక విద్యా కోర్సుల నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్.ఐ.టి. - వీటినే గతంలో రీజినల్ ఇంజినీరిగ్ కాలేజీలుగా పిలిచేవారు - 2002 నుంచి ఎన్ఐటీలుగా మారాయి) లు, ట్రిపుల్ ఐటీలు, ఇతర ప్రముఖ విద్యా సంస్థల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ఎ.ఐ.ఇ.ఇ.ఇ. (ఆల్ ఇండియా ఇంజినీరింగ్/ ఆర్కిటెక్చర్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్) జరుగుతుంది. ఈ పరీక్షను సీబీఎస్ఈ నిర్వహిస్తుంది.

మొత్తం సీట్లు: 12000

కోర్సుల్లో బి.టెక్.,బి.ఆర్క్ ఉన్నాయి.

అర్హతలు: సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్ ఉండాలి. వయసు 25 ఏళ్లు దాటకూడదు.

ప్రవేశ ప్రకటన: నవంబరు - డిసెంబరు మధ్య వస్తుంది.

పరీక్ష విధానం: దీన్లో రెండు పేపర్లుంటాయి.

పేపర్–1 బి.ఇ./బి.టెక్ కోర్సులకు సంబంధించింది. దీన్లో ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై ప్రశ్నలు ఇస్తారు.

పేపర్–2 బి.ఆర్కిటెక్చర్, బి.ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్దేశించారు. మ్యాథమెటిక్స్, ఆప్టిట్యూడ్, డ్రాయింగ్‌లపై ప్రశ్నలు వస్తాయి.

సిలబస్: సీబీఎస్ఈ తయారుచేసిన ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. రాష్ట్రంలో ఇంటర్‌లో సైన్స్ సబ్జెక్టుల సిలబస్ కూడా సీబీఎస్ఈకి సమానంగా ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు ఎక్కువ శ్రమపడాల్సిన అవసరం ఉండదు.

దేశవ్యాప్తంగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన బిట్ మిశ్రా, ఎన్ఎస్ఐటీ, డీసీఈ, ఐఐఐటీ, జేఐఐటీ, ఎస్పీఏ మొదలైన ప్రతిష్ఠాత్మక సంస్థలు, డీమ్డ్ వర్సిటీలు, జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న ఇతర ప్రభుత్వ విద్యా సంస్థలు ఇంజినీరింగ్ కోర్సుల్లో అభ్యర్థులను చేర్చుకోవడానికి ఏఐఈఈఈ ర్యాంక్‌నే పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

బిట్‌శాట్

బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) లో చేరేందుకు ఉద్దేశించిన పరీక్ష - బిట్‌శాట్. ఈ పరీక్ష ద్వారా పిలానీ, గోవా, హైదరాబాద్, దుబాయిల్లో ఉన్న బిట్స్ క్యాంపస్‌లలో ప్రవేశాలు లభిస్తాయి.

కోర్సులు: బి.ఇ.(ఆనర్స్), బి.ఫార్మ్ (ఆనర్స్).

ప్రకటన: జనవరి - డిసెంబర్‌ల మధ్య వస్తుంది.

పరీక్ష తేదీ: ఇది ఆన్‌లైన్ పరీక్ష. దీన్లో మొత్తం 4 పేపర్లు ఉంటాయి. మొత్తం ప్రశ్నల సంఖ్య - 150

పార్ట్ -1 లో ఫిజిక్స్, పార్ట్- 2లో కెమిస్ట్రీ, పార్ట్ -3 లో ఇంగ్లిష్ ప్రొఫిషియెన్సీ లాజికల్ రీజనింగ్, పార్ట్ -4 లో మ్యాథమెటిక్స్ ఉంటాయి. 3 గంటల సమయాన్ని కేటాయిస్తారు. పరీక్షలో వచ్చిన ర్యాంక్ ఆధారంగా సీటు లభిస్తుంది.

వెబ్‌సైట్: www.bits-pilani.ac.in

ట్రిపుల్ ఐటీలు

కంప్యూటర్ల ప్రవేశంతో ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా భారతదేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగానికి మంచి గుర్తింపు లభించింది. ఈ రంగంలో ఎప్పటికప్పుడు కంప్యూటర్ పరిజ్ఞానం అభివృద్ధి చెందుతూ ఉంటుంది. దీంతో ఆధునిక సాంకేతిక నిపుణులకు డిమాండ్ పెరుగుతూ ఉంటుంది. మార్కెట్ అవసరాలకు తగిన నిపుణులను అందించేందుకు ప్రత్యేక శిక్షణ సంస్థలు అవసరం. అందుకోసం ఏర్పడినవే ట్రిపుల్ ఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)లు. వీటిని ప్రభుత్వం 1998-2000 మధ్యకాలంలో ప్రారంభించింది. మొట్టమొదటి ట్రిపుల్ ఐటీని హైదరాబాద్‌లోనే ఏర్పాటుచేశారు.

ఐశాట్

అంతరిక్షం, వైమానిక శాస్త్రాలపై విద్యార్థులకు అవగాహన పెంచేందుకు 1998-2000 మధ్య కాలంలో తిరువనంతపురంలో ఏర్పడింది ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ. అంతరిక్ష పరిశోధనల్లో కావాల్సిన నిపుణులను తీర్చిదిద్దడానికి అత్యాధునిక సదుపాయాలతో, ఇంజినీరింగ్ కోర్సులను అందిస్తోంది.

కోర్సులు: ఎయిరోస్పేస్ ఇంజినీరింగ్, ఏవియానిక్స్, ఫిజికల్ సైన్సెస్‌లో బీటెక్.

అర్హతలు: ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో కనీసం 70 శాతం మార్కులను తొలి ప్రయత్నంలోనే పొందాల్సి ఉంటుంది. అలాగే పదో తరగతి అన్ని సబ్జెక్టుల్లో 70 శాతం మార్కులు ఉండాలి. తమ సంస్థలో విద్యార్థులను చేర్చుకోవడానికి 2010లో ఐశాట్ (ఐ.ఐ.ఎస్.టి. అడ్మిషన్ టెస్ట్)ను ప్రవేశపెట్టింది. ఈ పరీక్ష ఐ.ఐ.టి.-జె.ఇ.ఇ. తరహాలో ఉంటుంది. మొత్తం రెండు పేపర్లు ఉంటాయి.

సమయం: మొత్తం 3 గంటలు కేటాయిస్తారు. ప్రతి పేపర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై కనీసం 40 ప్రశ్నలు వస్తాయి. ర్యాంక్ ఆధారంగా అర్హులైన వారికి బీటెక్‌లో ప్రవేశం కల్పిస్తారు. కోర్సును సకాలంలో పూర్తి చేసిన వారు ఇస్రో (ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్) లో శాస్త్రవేత్తలుగా వెళ్లవచ్చు

ప్రకటనలు: సాధారణంగా నవంబర్ -డిసెంబర్ మధ్య వెలువడతాయి. పరీక్ష ఏప్రిల్‌లో జరుగుతుంది.

యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం

డెహ్రాడూన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్ సంస్థ అరుదైన ఇంజినీరింగ్ (బీటెక్) కోర్సులను నిర్వహిస్తోంది. ఎల్పీజీ, సీఎన్‌జీ, ఎల్ఎన్‌జీ, న్యూక్లియర్ ఎనర్జీ, ఎనర్జీ సిస్టమ్స్, రిఫైనింగ్ అండ్ పెట్రోకెమికల్స్, పైప్‌లైన్స్, జియో-సైన్సెస్, ఏరో స్పేస్, ఆటోమోటివ్ డిజైన్, మెకట్రానిక్స్, ఐటీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మొదలైన విభాగాలు బీటెక్‌లో ఉన్నాయి. వీటిలో చేరేందుకు సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్‌లో 60 శాతం మార్కులు అవసరం టెన్త్‌లో కూడా 60 శాతం ఉండాలి.

ప్రవేశం: జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించి విద్యార్థులను చేర్చుకుంటారు.

ప్రకటనలు: మార్చిలో వెలువడతాయి. ప్రవేశ పరీక్ష ఏప్రిల్, మేలో ఉంటుంది.

వెబ్‌సైట్: http://www.upes.ac.in

వీఐటీఈఈఈ

తమిళనాడులోని వేలూరులో ఉన్న వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కోర్సుల్లో (బీటెక్) ప్రవేశానికి నిర్వహించే పరీక్షే వీఐటీఈఈఈ (వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్). సాంకేతిక విద్యలో తనదైన విశిష్టత చాటుకుంటున్న ఈ సంస్థ ఉన్నత ప్రమాణాలతో విదేశీ విద్యార్థులనూ ఆకర్షిస్తోంది. వేలూరుతోబాటు చెన్నై శివారులోనూ క్యాంపస్ నిర్వహిస్తోంది.

ప్రకటనలు: సాధారణంగా నవంబర్- డిసెంబర్‌లో విడుదలవుతాయి. ఏప్రిల్‌లో పరీక్ష ఉంటుంది.

అర్హత: ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో కనీసం 60 శాతం మార్కులు ఉండాలి.

వెబ్‌సైట్: www.vit.ac.in

రాష్ట్ర స్థాయిలో...

ఎంసెట్

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్, మెడిసిన్, అగ్రికల్చర్, ఫార్మసీ, బయోటెక్నాలజీ తదితర కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షే **ఇంజినీరింగ్, అగ్రికల్చరల్ అండ్ మెడికల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎంసెట్).** ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆదేశాలకు అనుగుణంగా హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయు) ఎంసెట్‌ను నిర్వహిస్తోంది.

కోర్సులు: 1) బి.ఇ./ బి.టెక్.

2) బి.వి.ఎస్‌సి. అండ్ ఎ.హెచ్./ బి.ఎస్‌సి.(అగ్రి)/ బి.ఎస్‌సి.(హార్టికల్చర్)/బి.ఎఫ్.ఎస్‌సి./బి.టెక్. (ఎఫ్.ఎస్.అండ్ టి)/బి.ఎస్‌సి. (సి.ఎ.అండ్ బి.ఎం.)

3) ఎం.బి.బి.ఎస్/బి.డి.ఎస్./ బి.ఎ.ఎం.ఎస్./ బి.హెచ్. ఎం.ఎస్/ బి.ఎన్.వై.ఎస్.

4) బి.ఫార్మా/ బి.టెక్(బయోటెక్నాలజీ), ఫార్మా-డి.

అర్హతలు: ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరడానికి ఇంటర్‌లో, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథ్స్ చదివి ఉండాలి. ఇతర కోర్సుల్లో చేరేందుకు బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు చదివి ఉండాలి.

ప్రకటన: సాధారణంగా ఫిబ్రవరి- మార్చిలో నోటిఫికేషన్ వెలువడుతుంది. మే లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి 2011 మే 22న ఎంసెట్ జరుగుతుంది.

వెబ్‌సైట్: www.apeamcet.org

ఏఐఈఈఈలో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థులు సాధారణంగా కింది వరుసక్రమంలో కాలేజీలను ఎంచుకుంటారు

Top Colleges under AIEEE	Top NIT's under AIEEE
IIIT, Hyderabad	NIT, Trichy
NSIT, Delhi	NIT, Warangal
DCE, Delhi	NIT, Surathkal
IIIT, Allahabad	NIT, Nagapur
KITS, Bhubaneswar	MNNIT, Allahabad
BIT, Ranchi	NIT, Calicut
ABV IITM, Gwalior	NIT, Kurukshetra
SASTRA, Thanjavur	MNIT, Jaipur
PDPM IIIT, Jabalpur	NIT, Bhopal
Assam Univeristy, Silchar	NIT, Surat
GKV, Haridwar	NIT, Jalandhar
Shri Mata Vaishno Devi University, Jammu Tawi	NIT, Rourkela
IICT, Bhadohi	NIT, Raipur
NIFFT, Ranchi	NIT, Jamshedpur
	NIT, Durgapur
	NIT Hamirpur
	NIT, Silchar
	NIT, Srinagar
	NIT, Patna

(రచయిత హైదరాబాద్‌లోని
కృష్ణమూర్తి ఐ.ఐ.టి. అకాడమీ డైరెక్టర్)